క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల విద్యుత్ ఉప కేంద్రంలోని బెజ్జూర్ 33 కేవీ బూస్టర్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు కారణంగా సోమవారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆదివారం ఏఈ అజల్‌కుమార్ తెలిపారు. నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అధ్వానంగా రోడ్లు



గుంతలమయంగా మారిన రోడ్డు

జైనథ్: మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలుగా మారడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామంలో మిషన్ భగీరథ పనులు చేపట్టడంతో అంతర్గత రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంత్రి 'తుమ్మల'ను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రిని సన్మానిస్తున్న భోజారెడ్డి

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలోని రైతులకు రావాల్సిన రైతుభరోసా, రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గుట్ట ప్రవీణ్ మృతికి సంతాపం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ ఇటీవల మృతిచెందగా ఆదివారం పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గుట్ట ప్రవీణ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట యాసం నర్సింగ్‌రావు, దాసరి రమేశ్, కృష్ణ, సతీశ్, రాజు, సంతోష్ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

నేరడిగొండ: నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ మానవత్వం చాటుకున్నారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కొట్టల మోహన్‌కు ఆదివారం గుర్తు తెలియని వాహనం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. ఘటన స్థలంలో జనం గుమిగూడడంతో అక్కడికి చేరుకున్న ఎస్సై క్షతగాత్రుడిని తన వాహనంలో ఎక్కించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాముల సోమన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు షాదుల్లా, అక్కెపెల్లి లక్ష్మణ్, మనేశ్వర్ నారాయణలు తలమద్రిలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన సిందేకర్ వంశీకృష్ణకు చెందిన రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుచులాపూర్ గ్రామ శివారులో గల తన చేనులో ఆవులు మేత మేస్తున్నాయి. దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవులు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సేంద్రియం.. కనుమరుగు

- పొలానికి బలం
- పశువుల సంఖ్య తగ్గడంతో ఎరువుల కొరత
- రసాయన ఎరువులతో సత్తువ కోల్పోతున్న నేల



ధనోరాలో సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్న అరటితోట

కెరమెరి: గతంలో వేసవి వస్తే అన్నదాతలు పశువుల ఎరువులు చల్లడంలో నిమగ్నమయ్యేవారు. ఏడాదంతా సేకరించిన పశువుల ఎరువును పొలాల్లో చల్లి నేలను సారవంతం చేసేవారు. ప్రతీ ఏడాది కొంత పొలం చొప్పున చల్లుకుంటూ పొలానికి బలం పెంచేవారు. ఇప్పుడా పరిస్థితులు మారి సేంద్రియ ఎరువుకు బదులు రసాయన ఎరువులతో పంటలు సాగు చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. రైతుల ఇళ్లల్లో పశువుల సంఖ్య తగ్గడంతో ఎరువుకు కొరత ఏర్పడింది. గతంలో ఒక ఇంట్లో అధిక సంఖ్యలో పశువులు ఉండేవి. దీంతో విరివిగా పశువుల ఎరువును వినియోగించేవారు. కానీ ప్రస్తుతం పశువుల ఎరువు లేక కొనుగోలు చేసి మరీ పొలాల్లో చల్లుతున్నారు.

సారవంతమైన నేలలు..

గతంలో పశువులు రైతుల ఇళ్లల్లో అధికంగా ఉండేవి. ఒక్కో రైతు ఇంట్లో ఐదు నుంచి పది పశువులు ఉండేవి. పెద్ద రైతుల ఇళ్లల్లో పశువుల సంఖ్య భారీగానే ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో వాటిని సంరక్షించే పరిస్థితి లేదు. సాగునీటి వసతులు పెరగడంతో బీడు భూములు కనుమరుగయ్యాయి. పశువులు మేసే స్థలం లేకపోవడంతో పశువుల సంఖ్య తగ్గింది. పదేళ్ల క్రితం కెరమెరి మండలంలోని పశువులు 29,249, గేదెలు 1023, మేకలు 48,310, గొర్రెలు 1100 ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య సగానికి తగ్గి పశువులు 18,507, గేదెలు 624, మేకలు 33,253, గొర్రెలు 644 ఉన్నాయి. ప్రస్తుతం సాగులో విప్లవాత్మక మార్పులతో పాటు యాంత్రీకరణ పెరగడంతో సాగు అవసరానికి పశువుల సంఖ్య తగ్గింది. దీంతో సేంద్రియ ఎరువు గణనీయంగా తగ్గింది.



కెరమెరిలో అమ్మకానికి ఉన్న పశువుల ఎరువు

భూములు నిస్సారం

రైతుల ఇళ్లల్లో సేంద్రియ ఎరువులు లేకపోవడంతో రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ఈ పరిస్థితి కారణంగా చీడపీడలు పెరగడంతో పాటు భూసారం నిస్సారంగా మారింది. పశువుల ఎరువుకు డిమాండ్ పెరిగినా గ్రామాల్లో అందుబాటులో లేదు. చివరికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గొర్రెలను పొలాల్లో ఉంచి సేంద్రియ ఎరువు అందిస్తున్నారు. పశువుల ఎరువుల ట్రాక్టర్ రూ.2000 వరకు ఉంది. అంతా ఖర్చు భరించి కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి లేదు. దీంతో రసాయనిక ఎరువును పంటలకు వినియోగిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పదేళ్లుగా సేంద్రియ పంటలు

నేను పదేళ్లుగా సేంద్రియ పంటలు సాగు చేస్తున్నాను. నాకున్న ఏడు ఎకరాల్లో అరటి తోటలు, మామిడి, కంది, పెసర వేరుశనగ, సోయ పంటలు పండిస్తున్నాను. పంటల్లో బాగా దిగుబడి వస్తుంది. ప్రతీ రైతు పశువుల పేడను పొలాల్లో చల్లాలి.

– కేంద్రె బాలాజీ, రైతు, ధనోరా

అపూర్వ సమ్మేళనం



ఆసిఫాబాద్‌అర్బన్: 2007 –2008 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి పలకరించుకున్నారు. కార్యక్రమంలో గురువులు ఉమాబాల, శరత్, లక్ష్మణ్, వెంకటరమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నదీ సమీపాన గల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ప్రారంభం కానున్న శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు దహగామ శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనము, నవగ్రహ ఆరాధన, వాస్తుమండల పూజ, అగ్ని ప్రతిష్టాపన హావనములు, మన్యుసూక్త వచనం, శిఖర కళశానికి ఆదివాసాలు నిర్వహించి, అనంతరం తీర్థప్రసాద వితరణ చేట్టారు. రాత్రి భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు ఆలయంలో మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పట్టణంలోని విజేత ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరై మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్య పరీక్ష పరికరాలు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను సేవా సమితి సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు సుంకరి తిరుపతి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, పెద్దపల్లి కిషన్‌రావు, ముంజం బాబురావు, బలకృష్ణ, మంజుల, ప్రవంతి, అఖిలేష్, సేవా సమితి సభ్యులు వినోద్, రామస్వామి, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



హరీశ్‌బాబుకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

- ఆరు నెలలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం
- దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు
- పట్టించుకోని అధికారులు



రాజంపేటలోని ఓ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నుంచి వేరుపడి నూతన గ్రామపంచాయతీగా ఏర్పడ్డ రాజంపేటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఆయా కాలనీల్లో చెత్తాచెదారం తొలగించడానికి కావాల్సిన వాహనాలు లేకపోవడం, కార్మికులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ జరగడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా చెడిపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా కాలనీల్లో ఆరు నెలలుగా చెత్తాచెదారం తొలగించకపోవడంతో ఆయా కాలనీల్లో దుర్గంధం వస్తోంది. గ్రామపంచాయతీకి పన్నుల చెల్లిస్తున్నా, కాలనీల నిర్వహణ ఎందుకు చేపట్టడం లేదని రాజంపేట వాసులు ప్రశ్నిస్తున్నారు. చెత్త తొలగించకపోవంతో రోజురోజుకూ చెత్తాచెదారం పెరగడం, డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీకి సిబ్బందితో పాటు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి



రాజంపేటలోని కాలనీల్లో పంచాయతీ అధికారులు పర్యవేక్షించి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి. గత 6 నెలలుగా రాజంపేటలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉంది. సమస్యలపై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇతర జీపీలకు ఉన్న మాదిరిగా రాజంపేట జీపీకి సిబ్బందితో పాటు, అన్ని హంగులు కల్పించాలి.

– సీహెచ్ కళావతి, రాజంపేట

అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



నూతనంగా ఏర్పడిన రాజంపేట గ్రామపంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి. డ్రెయినేజీ, రహదారుల నిర్మాణం చేపట్టాలి. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి ప్రత్యేక వాహనాలు మంజూరు చేయాలి. వీధి దీపాల ఏర్పాటుతో పాటు, ఇతర సమస్యలను పరిష్కరించాలి. రాజంపేట జీపీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు శ్రద్ధ చూపాలి.

– జి. సంతోష్, రాజంపేట

అధ్వానంగా రోడ్లు..!



ఘాట్‌రోడ్డు మూలమలుపు వద్ద కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డు

- గుంతల రోడ్లతో తరచూ ప్రమాదాలు
- మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కరువు

నార్నూర్: జిల్లాలో నిత్యకృత్యంగా మారిన రోడ్డు ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. వాహనదారుల అతివేగానికి తోడు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన రహదారులు నరకంగా మారుతున్నాయి. ప్రతీరోజు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనంతో రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతంలో ఏ గిరి గ్రామాలకు వెళ్లాలన్న రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్డు రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, రోడ్లు నిర్మించాలని ఎన్నికల సమయంలో ఆదివాసీ గిరిజనులు కోరుతూనే ఉన్నారు. కానీ కనీస రోడ్డు సౌకర్యాలు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోకపోగా అటవీశాఖ నిబంధనలు ఉన్నాయంటూ పనులు నిలిపివేస్తున్నారు. దీంతో ఇరుకైన రోడ్లపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.



కెరమెరి మండలంలోని పరందోలి జంగుబాయి పుణ్యక్షేత్రానికి వెళ్లే రోడ్డు

హెచ్చరిక బోర్డులు కరువు..

నార్నూర్ మండలంలోని మాలేపూర్, గాదిగూడ మండలంలోని ఖడ్కి, డాబా, మారెగాం ప్రధాన రోడ్లతో పాటు ఘాట్ రోడ్లపై మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఘాట్ మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంది. దీంతో వాహన చోదకులు తమ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదానికి కారణమవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఘాట్ రోడ్లపై మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బోరుబావిని ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని సాలెగూడ గ్రామంలోని బోరుబావిని ధ్వంసం చేసి అందులో బండరాళ్లు, మట్టివేసి పూడ్చివేసిన అటవీ శాఖ అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పూడ్చేసిన బోరుబావిని వారు పరిశీలించారు. తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ మాట్లాడుతూ సాలెగూడ గ్రామ ఆదివాసీల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం బోరుబావిని మంజూరు చేసిందన్నారు. 15 రోజులుగా ఆదివాసీలు పెర్సపెన్ కార్యక్రమంలో ఉండగా అటవీశాఖ అధికారులు బోరుబావుని బండ రాళ్లు వేసి ధ్వంసం చేసి మూసి వేయడం సరికాదన్నారు. అక్కడ వేసిన బోరు అటవీ ప్రాంతంలోకి రాదన్నారు. అధికారులు ప్రత్యేకమైన బోరుబావి వేసి వారికి నల్లాల ద్వారా నీళ్లు అందే చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, మండల అధ్యక్షుడు మెస్రం కేశవ్, నాయకులు మర్సుకోల భరత్, ఉయికే దినేశ్, పుస్నక్ రమేశ్, కుడ్మేత జంగు, సుంగు తదితరులు ఉన్నారు.



అటవీశాఖ అధికారులు పూడ్చేసిన బోరుబావిని పరిశీలిస్తున్న నాయకులు

వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆలయ ఆవరణలో కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు తిరుపతి, వేణుగోపాల్, భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన గురువారం వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాదవితరణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



దాతల కోసం ఎదురుచూపులు

మండుటెండల్లో ఆహార వేట



బిడ్డలకు పాలిస్తూ..

ఎండాకాలం కావడంతో కెరమెరి మండలంలోని ఘాట్‌పై ఉన్న వానరాలు ఆకలితో అలమటిస్తున్నాయి. అడవుల్లో ప్రస్తుతం ఆకులు రాలిన చెట్లు తప్ప ఏమి లేకపోవడంతో కాలే కడుపులతో రెండు వైపులా వెళ్తున్న వాహనాల వైపు దీనంగా చూస్తున్నాయి. వాహనాల శబ్దం రాగానే పరుగెత్తుకుంటూ వాహనాల దగ్గరకు వస్తున్నాయి. సుమారు 300 వరకు కోతులు ఉండడంతో దాతలు అందిస్తున్న ఆహారం, పండ్లు కూడా వాటికి సరిపోవడం లేదు.

– కెరమెరి

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా దిశ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో దిశ సూపర్‌వైజర్ రాజేశ్, ఐసీటీసీ హరీశ్, సతీశ్, రాజశేఖర్, చేతన టీఐఎన్జీవో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.